# మా ఊరి తత్త్వం



"ఓయబ్బా! ముంతక్కాళ్లొచ్చినట్టు దీన్నొక ఇంతల్లో ఇంతగా ఇచ్చు ఇలంబరవని సెప్పుకుంటా ఉండావే? అప్పిటికి నీకొక్కడికేనా జాబొచ్చింది. నువ్వు సెప్పుకుండేది ఇంటా ఉంటే ఈ పోస్టల్ డిపార్టుమెంటూ... దాంట్లో పన్జేస్తావుండే ఉద్యోగస్తులందురూ నీ కోసరంవే ఉణ్ణిట్టుగా ఉండాదే? అంటా కేవలంజేసి పారేయబాకండి. అబ్బరంగా బిడ్డె పుట్తే గెడ్డ పారెత్తుకోండి సెవులుకుద్దాం! అన్నెట్టుండాదని ఎక్కిరించబాకండి. సెప్పేది స్రెద్దగా ఇనిపించుకోండి. మల్లా గావాలంటే మీయబ్బతోడు. మీ తలపాడు!

నువ్వు సెప్పేదేంది? మేంవు ఇనిపించుకుండేదేందంటే ఇతండంవంటే కోదండంవన్నెట్టుంటాది. అయినా చూడబోతే అదీ ఒక నాయవే గదా? తూబెహ! నాదేంవుండాది. ఈ సీంవలో యారాళంగా ఉండే రాళ్లూరప్పల్లో ఒక రప్పను. నీళ్లే లేని బాయిలో కప్పను. తిండికి లేకుండా 'అలో రాంవ సెంద్రా'! అంటా అలవంటించే బీదా బిక్కీ సేతిలో దుంకపడిన సిప్పను. పుడింగంటే అర్తంగూడా తెలవకుండా పాడుకూతలు కూసే పోరంబోకు యదవల్లో యదవను!

అటుమంటోడి సేతికొక్క జాబొచ్చిందంటే ఇంకేఁవుండాది? కుక్కనోటికి సియ్యలేని ఎఁవిక దొరికినట్టే గదా? అదా ఎఁవికను ఇడ్సిపెట్లేందు. అట్టని కొరకలేందు. అందాజుగా ఆ కుక్క మాదిర్రైపాయ నాగెతి!

ఎవుడి కతన్నా ఎట్టన్నా పోనీ గానీ మరీ ఆ పోస్టాపీసులో ఉండాడొక నాయాలు. ఈడ్సీడ్సి కొలిస్తే జానకు నాలుగడ్డేళ్లు తక్కవగానే ఉంటాడు. పేరు సుబ్రాయపిల్ల. కర్నూఁవోడు గదా నాయాలు. మణిసికి మాంతఁవయిన పెగ్గె. మల్లా అవుపిస్తేసాలు. 'మాఁవా! మాఁవా!!' అంటా శానా మరేద ఒలకబోస్తాడు. ఈ ప్రెబుత్వం వీయంలకు కేయంలకు కూడా తోక తెగ్గోసి సున్నంబెట్టంగా సరిపాయ. లేకుండా బోతే పట్టేదానికే పగ్గాలుండవనిపిస్తింది. మరీ వాడైతే- 'అఁ! నీ మొకానికి జాబెవుడు రాస్తాల్లే? అట్టా మాదిర తల మాసినోడు ఎవుడైనా రాస్తే తెచ్చి మీ ఇంటికాణ్ణే ఇస్తాం గదా? గవర్నమెంటోళ్లు మాకెందుకు జీతాలిస్తా ఉండేది? నువ్వెందుకు ఈన్నెగొడ్డు ఇంటిసుట్టూ పెళ్లుసుట్టూ తిరిగినట్లు పోస్టాపీసు సుట్టూరు తిరిగేది?' అంటా కసిరికొట్టాఉండె.

అటుమంటోడు నేను పోస్టాపీసు కాడికి పొయ్యేకుందికి నవ్వతా కడగా ఎత్తి పెట్టుణ్ణె జాబొగిటెత్తి నాసేతికిస్తే ఇంక నేనేఁవయిపోవాల? ఆ పోస్ట్‌మేన్ నాకంటికొక పి.యం. మాదిరి అగుపిస్తా ఉంటే ఆ జాబు ఆయన సేతులార ఇస్తావుండే సట్టిపికట్టు మాదిర్తో అందుకుంటి.

ఆ జాబు సేతిలో కొస్తానే అట్టా యిట్టా కదలకుండా అణ్ణే నిలబడుకోని సదువుకుణ్ణా! దోవలో నడస్తానే సదువుకుంటా వొచ్చినా. ఇంటికొచ్చినాకన్నా ఆడబారేసుంటే సరిపోలా? అదెట్టా పారేసేది? అప్పుడే సెప్పనే సెప్తిని గదా? కుక్క నోటికి ఎఁవిక మాదిర్తో అయింది నా కతని?

ఇంట్లో కూసోనికూడా మాటమాటకు ఆజాబెత్తి సదువుకుంటా ఉంటే అది మా బాశాలి కంట్లోపడె!

బతుకులో అప్పిటికే ఆపెదేహం నిండుకూ సందేహం నాకు పాణసంగటంగా రూపకారం అయిపొయ్యుండాది. అందుకే-

"ఎవుర్రాసిందా జాబు?" అనడిగె.

సెపేయచ్చుగదా! అహఁ! అడగతానే సెప్పేస్తే ఎట్టా? వొగిటని రొండనిపించుకోకుండాబోతే అదొక జలమ్మా? జలమానికి పట్నె పీడనా? అందుకే 'నీకెందుకే?' అంటా కసిరికొడ్తి.

మీరు నిజం జెప్పినా ఇంటారు. అపద్దం జెప్పినా ఇంటారు. ఆ మాట్తోగూడా ఆడెవురో ఒక ఇంటావె జగడఁవెట్టొస్తింది జంగఁవయ్యా? అంటే బిచ్చంబెట్టే బొచ్చు ముండా! అన్నాడంట. అట్టా మాదిర్రైపాయ నాగెతి!

"ఎట్టెట్టా? నాకెందుకా? నాకే గాకుండాబోతే ఇంకే నాసవతిగ్గావొల్సిచ్చిందే? మొగుడికొచ్చిన జాబు కత పెండ్లానికి తెలవకూడ్దంటే వాడేం మొగుడు? అదేం పెండ్లాఁవే? సెప్పే! ఏ పలగాకి నాసవతి రాసిందే ఆ జాబు?- అంత అక్కరగా సదవతా ఉండావు?" అంటాలగుసుకుండె.

నేను ఇంకా కొంచిం బిగుసుకుంటి!

"అహా! నాకు తెలవకుండా అడగతా ఉండా. ఈ ప్రెబుత్వం ఆస్తి హక్కును ఆడోళ్లకందురికీ ఇచ్చినట్టుగా మొగుళ్లకొచ్చిన జాబులన్నీ పెండ్లాలకు తెలవాలని సట్టం గిట్టం జేసిపారేసిందా? అట్టయితే ముందుగా నువ్వు ఎలబారు. మీయమ్మగారింటిమింద పడు. ఆస్తిలో సగం పంచుకోన్రా. మల్లా గావాలంటే ఈ జాబు నీ సేతికే ఇచ్చూడస్తా. నీ యిష్టంవొచ్చినంతసేపు సదువుకో. నాకే అబ్బెంతరం లేదు!"

"ఒరెవారెవారె! మొగోడంటే నువ్వేరా నా బంగారి మొగుడా! వొగిటేసారిగా యాడికేడి కేసినావురా? అయినా ఇన్నేండ్లు కాపరంజేసి ఇంతమంది బిడ్డల్ను కనుక్కోని ఇప్పుడుబొయ్ వాళ్లను ఆస్తి పంచీమని నోరుతెల్సి అడగాలంటే నీకు సిగ్గులేకుండాబోతే నాకన్నా సిగ్గుండక్కర్లే?"

"సిగ్గు! హ్వాహ్వాహ్వా! దాన్నిడ్సిపెట్టేసి ఎంత బాదపడ్తే ఇంతమంది బిడ్డలు ఈ దేశ జనాబాలో సేర్నారో నీకు తెలవదంటే? ఇంక నేనేడబొయ్‌సావాల? ఎవుడ్తోబొయ్ సెప్పుకోవాల?" అని అందాంవనుకోని నోటిదాకా వస్తే మింగుకోని–

"ఈ లోకంలో సిగ్గిడ్సిపెట్టేసిన్నా కొడుకులేనే సీకుసింతా లేకుండా బతకతా ఉండేది. ఈదికి పెద్దోళ్లవురే? ఇడ్సేసినోళ్ళగదే! సిగ్గు... అబిమానం మట్టామరేద అంటా మాట్లాడే యదవలంతా ఆపూట కాపూట లాట్రీ గొట్టుకుంటా ఉండార్లేయే!"

"ఇదేంవన్నా కొంపా? కోరట్టా?" అంటూ మా సిన్నపిల్ల సీన్లోకొచ్చె.

ఆ సిన్నపిల్ల సీన్లోకొచ్చిందంటే తెరపడి పోవాల్సిందే! ఎందుకంటే–

దానికి ముక్కుమిందనే కోపం. ఒగిటంటే తక్కువ. రొండంటే జాస్తి. అబ్బని సూసేదిలే... అమ్మని ఎంచేదిలే. పట్టుకుణ్ణిందంటే సిన్నప్పుడు అమ్మలో అమ్మమ్మలో పోసిన వజతో కూడా వొదిలిపోవాల్సిందే! అందుకని ఆ అమ్మిని మంచిజేసుకుందాంవని–

"సూడమ్మా! ఎంగట్రెడ్డి జాబురాస్తే ఏ నాసవితి రాసిందని గిచ్చిజగడానికీడస్తా ఉండాది మీయమ్మ– తెల్లార్తో ఇంకేంవీ పనీపాటా లేనట్టుగా!"

మా బాశాలి కల్లా వొకమాదిర్జూస్తా పురెక్కించేకుందికి–

"ఆ మాట అప్పుడే జెప్పి ఏడ్సుంటే సరిపోలా?" అంటా మూతి ముప్పై మూడు తిప్పులు తిప్పె మా బాశాలి.

కావాలనుకోని తిప్పినా మూతి అన్నివొంపులెట్టా తిరిగిందబ్బా? అనుకుంటానే మా బాశాలి కత ఆడికిడ్సిపెట్టేసి మల్లా జాబుమింద గుష్టి పెడ్తి.

"అన్నా! పిలగోణ్ణి కుక్క కర్సింది. అదిగూడా పిచ్చి కుక్కంటా ఉండారు. దానికేంవో శానా సూదులెయ్‌పించాలంట్నే? నేనెలబారొస్తా ఉండా. నువ్వొక ఏడూళ్ల మణేగోడివి. ఈ పొద్దు పుత్తూరంటే రేపు సిత్తూరంటావు. అట్టామాదిరి యాడికీ పోవద్దు సాంవీ నీకు పుణ్ణెంవుంటిది. పిలగోడికి సూదులెయ్‌పించే ఏర్పాటేందో సూసినాక మల్లా గావాలంటే నీయబ్బతోడు.

యాడికన్నాబో. నీకు తెలవన్దేంవుండాది? ఉప్పుగల్లు మాదిరి వీడొకడే గదా? అటుమంటోడికి రారాని కష్టవొచ్చె. ఈ కష్టాన్నుంచి ఎత్తట్టా గెడ్డనబారేస్తే సచ్చి నీ కడపన పుట్టా. ఎట్టా వస్తావుండాను గదా? అన్నీ నేర్లో మాట్లాడుకుందాం!"

ఈ నాలుగ్గీట్లు నలబైమాట్లు సదివేకుందికి ఎంగట్రెడ్డి కత సప్పుజల్లారిపాయ. వాడి కొడుకును కుక్క కర్సిన కత కప్పుదిని పాయ. నా మణుసు మా ఊరిమిందికి మల్లె!

మా ఊరంటే సటపటంవయిన్దేవిగాదు!

ఆ ఊళ్లో మత్తేబులుంటారు. వాళ్ల మోసేతలకింద నీళ్లు తాగతావుండే మామూలు మణుసులూ ఉండారు.

మేగాల్లో నీళ్లు దెచ్చే మొగలాయిలుండారు. ఎదిటోణ్ణి అడిగి శారదంటే శారదు మంచినీళ్లు పుట్టించుకోలేని అంబేదుగులుండారు.

తడి గుడ్డల్తో గొంతులు కోసే మొగలాయిలుండారు. అట్టా కోస్తా ఉంటే సూస్తా గమ్మునుండే కోసనాయాండ్లుండారు.

దేవుడు యాడుండాడని ఎగటాయించి మాట్లాడేవాళ్లుండారు. కనిపించిన రాతికి రప్పకు సెట్టుకు పుట్టకు మొక్కే ఎర్రిఎంగళప్పలుండారు.

నోట్తో నవ్వతా నొసల్తో ఎక్కిరించే అతి తెలివి నాయాండ్లుండారు. నోరూ వాయీ రొండూ లేని దమ్మిడికి కొరగాని దద్దమ్మలుండారు.

తంటలు బెట్టి ఉంటలు యారకతినే తగరారు మణుసులుండారు. తగరారంటే ఆంవడ దూరాన నిలబడి తంవాసా జూసేవాళ్లుండారు.

మాటల్తోనే మసిబూసి మారేడు కాయజేసే వాళ్లుండారు. కల్లాకపటం మాయా మర్మం ఎరగని అమాయకులుండారు.

నీళ్లకవతలికిబొయ్ సదివేసి వొచ్చినోళ్లుండారు. ఏలిముద్ర ఏసేత్తో ఎయ్యాల్నో తెలవకుండా మణిసిని ఎగాదిగా జూసే ఎర్రోళ్లుండారు.

ఓయబ్బా! ఊరిమొగదాల గుంటకట్ట మింద సింతమానికింద నిలబడుకోని అయిద్రాబాద్ రాజకీయాలను అరిసేతల్లో డిల్లీ రాజకీయాల్ను ఆ సింతసెట్టుకే కాపుగాయించే సెట్టుకింద వకీళ్ళుండారు. పొగులు మాట్లు పని పన్చేటు రేత్రి మాట్లు నిద్దర పన్చేటని వైదొలిగి పొయ్యే వాళ్లుండారు.

వంచిన నడుంవెత్తకుండా బూవమ్మతో పోరకలాడే వాళ్లుండారు.

ఇంతదూరం ఎందుగ్గానీ మా ఊళ్లో లేని మణిసి ఇంక ఈ ఎండలుగాసే బూమండలమ్మీద యాడగానీ ఉండడానికిల్లేదని రొమ్ముగుద్ది కావాలంటే సెప్పచ్చు.

అందుకే సింతసెట్లకింద హైస్కూలు తెలుగులో సెప్పాలంటే ఉన్నత పాటశాల గాలివాటంగా సాగిపోతా ఉండాది. అయితే ఆ ఊళ్లో ఒక ఆసిపత్రి మాత్రం లేదు.

ఆసిపత్రి? ఎందుకు ఉండాల? రోగాలు మణుసులగ్గాకుండా మాకలకా వస్తాయి? వస్తాయి. వచ్చినవి వొచ్చినట్లే పోకుండా ఎల్లకాలం కూసోనుండబోతాయా? అని ఆలోసించిన మహన్నుబావులు పల్లెలు దేశానికి ఎన్నెముకలని సొతంత్రం వొచ్చినప్పట్నుంచి సెప్తానే ఉండారు. మనం ఇంటానే ఉండాం.

"సదేలే! ఆడేణ్ణో ఒక మారుమూల కొంపలో ఆడెవుణ్ణో ఒక ఎరిముండ మంత్రి కొడుగ్గాక పాయ. కడాన ఆ మంత్రికి సొయాన గాకుండా పొయ్‌నా ఏలిడ్సిన అల్లుడైనా గాకపాయ. వాణ్ణిబొయ్ వొక కుక్క కరిస్తే దానికి ఈ దేశంలో ఉండే జనఁవంతా ఎగబెట్టుకోని పోవాల్నా? పొయ్ ఏం జెయ్యాల? నువ్వు జెప్పేది బలే బాగుండాదే? మణుసులు మణుసుల్నే సంపుకోని సస్తావుంటే కుక్క కర్సిందానికి నువ్వేందో శానా వగస్తా సీది సీదేస్తావుండావే?" అని మీరంతా అడగతారని నాకు తెల్సు.

మీరు నన్ను, నేను మిమ్మల్ని అడుక్కోవాల్సిందే తప్ప, మనమంతా వొగిటై ఈ ప్రెబుత్వాల్ను నిల్దీసేటిగా ఉంటే మనకర్మ ఇట్టా ఎందుగ్గాల్తిందిలే?

అటుమంటి దినం వొగిటొస్తిందని నమ్మకం లేకుండా పొయ్‌నా నమ్మకంగా మా ఎంగట్రెడ్డి మాత్రం వొస్తాడని నాకు తెల్సు.

అయితే ఎప్పుడొస్తాడజ్జెప్పేదే శానా కష్టిం!

వస్తే ఎంటనే ఎలబారొచ్చేస్తాడు. లేకుండాబోతే ఆ మర్సటి దినఁవైనా ఎలబారి రావచ్చు. అదే సెప్పేదానికిలే. తీరా వచ్చినాక ఏఁవిరా? ఇంతాలీశం జేస్తివే? అని అడిగినావనుకో–

"ఏం జెయ్యమంటావ్ సెప్పన్నా? ఆకుతోట తీగె దించతా ఉంటే పిలగోణ్ణి దానెమ్మా నాయాలి కుక్క కర్సె. ఈణ్ణి కుక్క కర్సిందని ఆ తోటను అట్నే నడిమింతరాన ఇడ్సి పెట్టేసివస్తే మల్లా మా బతుకులు కుక్కలపాలే గదా? అదట్టయ్ పొయ్యేకుందికి మిట్టబాయికింద మిరప తోట మలమలా మాడిపోతా కంటబడె. దానికట్టా తడింబుడింగా తడేసేటప్పిటికి దినం తిరిగె. రాగి పైరు నాట్నానికి దుక్కిజేద్దావని బీడు తడిపెట్టుంటిఁవా? అదెండిపోతిందని దాంట్లో మడకలు గట్టే కుందికి ఈ యాళాయె!" అంటా వొక రాఁవాయిణం సదగతాడు.

వాడి ఇబ్బందులు వాడివైతే ఇంక ఎదుర్జూసే వాడిబ్బందుండాదే? రాఁవ! రాఁవ! ఆ బాద పగోడిగ్గూడా వద్దనిపిస్తుంది. అయినా వొక కడపన పుట్టకుండా బొయ్‌నా అంతకంటే జాస్తిగా వొకిరికొకరనుకుంటా బతికినోళ్ళం. ఇప్పుడు సఁవియానికి వొదక్కుండాబోతే ఎట్టని ఎంగట్రెడ్డి కోసరం ఎదుర్జూస్తా కూసింటి!

"ఇదింకా బలే బాగుండాదే? వొచ్చినోళ్ళకు వండి పెట్టుకుంటా రానోళ్లకు ఎదుర్జూస్తా కూసుంటే ఈ కొంప ఇంక కడతేర్నిట్టే! ఆడెవురో ఎప్పుడో దిగబడబోతాడని ఈ మొగోడు

ఎదుర్జూస్తా కూసుండె. అయినా ఆ మాటన్నేల? దానికి రొండు రానేల?" అంటా మా బాశాలి శాట్లో గింజిలు పోస్తే కోడి ముక్కుతో పొటిక్ పొటిక్‌మని పొడ్సి పొడ్సి తిన్నెట్టు పొడస్తా ఉండాది.

సీటికి మాటికి దేని మిందనో సాటవబెట్టి పొడస్తా ఉంటే మా బాశాలి పొడుపు మాట్లు మఱుసును తూట్లు పొడస్తా ఉంటే అడపా దడపా వాడు రాసిన జాబును సదువుకుంటా ఉంటే వాడు రానే వొచ్చె!

వాడు అడుగు ఇంట్లో పెట్తానే నేను అడుగు కదిపి 'పదరా అబ్బారే!' అంటే 'ఏందన్నో? లేడికి లేసిందే పరుగన్నెట్టుండాదే యవ్వారం? ఆ ఎర్ర బస్సులో కూలబడొచ్చే కుందికి నడుఁవులే నల్ల బాగులైపాయ. నువ్వు రొంచేపు తట్టుకో సాఁవీ! నీళ్ళో నిప్పులో కొట్టుకోనీ! పాణఁ వట్టా కుదటబడ్తే! మల్లా గావాలంటే ఎలబార్దాం!" అంటూ వాడు కూలబడె.

సరే! వాడి మాటెందుకు కాదనాలని నేను గూడా వాడ్తోగూడానే కూలబడి "అవున్రా? పిచ్చికుక్క ఊళ్ళో ఉంటే మీరంతా ఏం జేస్తా ఉణ్ణెట్టురా? అసలు కుక్కల్తో పడేదే అగసాట్లుగా ఉంటే పిచ్చి కుక్కల్తో పడేదంటే మాట్లా? ఈపొద్దు ఈ పిలగోణ్ణి కరిస్తే రేపు ఇంగొకణ్ణి ఆ మర్సటి దినం ఇంగొకణ్ణి కరిస్తింది. ఇట్టా మాదిరి కరస్తా ఉంటే ఎంతకాలఁవని మీరు గాజులు తొడుక్కోని సూస్తా ఉంటార్రా?" అని అడిగేకుందికి–

వాడు నిట్టూర్సెరా నా తండ్రీ! వాడి ముక్కల్లో గాలి ఊదనబుర్లో ఎలబారినట్టు ఎలబారె! దగ్గిర దావాదంలో దీపెంగీపెం ఎలగతా ఉణ్ణుంటే మాటలో మలిగిపోవు. అంతలావు నిట్టూర్సి మా బాశాలిచ్చిన మంచినీళ్ళు ఒక్క గుక్కలో తాగేసి మొకానికి పట్నె సెవట్ను పై సవకంతో తుడ్సేసి 'అన్నా! దానికి పిచ్చిగాదన్నా? మదం!' అనె.

"మదం ముదిర్తే పిచ్చిగానీ లేరా! మీ పిచ్చి గాకుండాబోతే పిచ్చి కుక్కను ఊళ్లో బెట్టుకుని ఎవురైనా కాపరం చేస్తారా?" అని గూటిస్తి.

'నువ్వడగతా ఉండేది బలే బాగుండాదన్నా! అయినా ఏంజెయ్‌మంటావు సెప్పు? పోనీ ఆ కుక్క ఊళ్ళోకెట్టొచ్చిందో తెల్సునా?" అనడిగె.

నాకేందెల్సు? అన్నెట్టుగా మొకం పెట్టేకుందికి వాడు గెఁవనించి–

"అట్టా మాదిరొచ్చిన కుక్క ఇట్టా మాదిరవుతుందని ఎవుడూ కల్లో గూడా అనుకోలేదన్నా? తొలీతగా అది ఊళ్లో అడుగుపెట్టినప్పుడు పిలగోణ్ణిసూణ్ణీ పెద్దోణ్ణిసూణ్ణీ 'కుఁయ్ కుఁయ్' మంటా ముందిరి కొచ్చేది. ముంగాళ్లను పాదాలమిందికి సాపేది. సాష్టాంగబడి దణ్ణంబెట్టా ఉండానన్నిట్టుగా మణిసి మొకంకల్లా సూసేది. ఆ దెబ్బతో మణిసి గుమ్మయిపోతాడు. అయ్యోపాపం! అనుకుంటా దానికల్లా సూస్తే సాలు. ఎట్టా గెఁవనించేదో గెఁవనించేది. లేసి తోకాడిస్తా 'కుఁయ్ కుఁయ్' అంటా ప్రెదచ్చినం జేసినట్టు మణిసి సుట్టూరా సుట్టకలాడేది!"

ఇట్టామాదిరి వారం తిరగకముందే ఊళ్ళో వాళ్ళందర్నీ మంచి జేసుకుండె!

ఆ ముదిగారంతో దగ్గిర జేర్సేకుందికి మూతుల్నాకేదానికి మొదులుబెట్టె!

"కుక్కలేగాదు ఇట్టా జాతి మణుసులుగూడా ఉండార్లేరా? నువ్వు జెప్పు!" అంటే–

"అదేగదా సెప్పేది. అయితే వొగటన్నో ముదిగారం కుక్క మూతుల్నాకేదే గానీ తింటాం వుణ్ణా అది సేతిలో వుంణ్ణా అంత పెట్టేగాని తినేది గాదన్నో!

ఆ దెబ్బతో దాని మంచితనం ఊరంతా యాపించిపాయ.

"కుక్కంటే అట్టుండాల్రా? నట్టింట కూసాన బెట్టే ఏంవుండాది? వంటింట్లో పాణుకోబెట్టే ఏంవుండాది? కన్నీరు కంటి సూపేగానీ కవళం ఆశిస్తిందా? మల్లా ఊళ్ళో ఉండాయి కుక్కలు! ఎందుకు? యావార్తే సాలు. ఎగరేసుకోనిపోతాయి.

ఊళ్ళో ఏ నోట్లో ఇందాంవన్నా ఇదే మాటన్నా!

దినాలు గడ్సె. వారాలు గడ్సె. నెలలు గడ్సె. ఊళ్లో వాళ్ళందురికీ ఆ కుక్కమింద శానా గురి కుదిరె. అది ఇంట్లో ఉంటే తలుపులు మూసేదిగూడా మర్సిపోతా ఉండ్రి.

ఏంజెంయ్‌మంటావ్ సెప్పన్నా? దానెమ్మా నాయాల్ది ఇట్టామాదిరి నమ్మించి నమ్మించి తినేదానికి మొదులుబెట్టె ! ఆ ఇంట్లో ముద్ద సంకటి తినె. ఈ ఇంట్లో ముద్ద బెల్లం లగాయించేసె! అంటా ఉండంగానే దాని రెట్టమదం అట్టాసంగా పెరిగిపాయ. ఇప్పుడు సూస్తా సూస్తా ఉండంగానే నువ్వు జూస్తే మాత్రం నన్నేం జెయ్‌బోతావులే? అన్నెట్టుగా దొరికింది దొరికినట్టుగానే నోటికి కర్సుకోని పోతావుండాది. ఇట్టా మాదిరి తినితినీ దానికి బాగా మదంవెక్కె. నువ్వన్నెట్టుగా మదం ముదిరేకుందికి పిచ్చెక్కినట్టుండాది.

ఇప్పుడిట్టా మాదిరి వరసబెట్టి కరస్తా ఉండాది.

"అదేరా నేనూ అడగతా ఉండేది? వరసబెట్టి కరస్తా ఉంటే వాయీ నోరూ రొండూ మూసుకోని ఎట్టుండాల్రా? ఊరంతా వొగిటైతే అదెటుమంటి పిచ్చి బట్టిందైనా తప్పించుకోని పొయ్యేదానికి దాని తరంవవుతందంటావా?"

"అయితే ఆమాత్రం మాకు తెల్దంటావో?"

"తెలిస్తే ఎందుకు గమ్మునుండాల్రా?"

"అన్నా! మణిసికి యాడుండాదన్నా దాని తెలివి? అట్టపడి ఇట్టపడి అదిపొయ్ యాడకుదురుకుణ్ణిందో తెల్సునా?– మన ఎమ్మెల్యే మేనల్లుడి ఇంట్లోగదా కుదురుకుణ్ణింది. ఇప్పుడు తనబలానికి స్తానబలంతోడాయ. దాంతో అది ఆడింది ఆట. పాడింది పాట!– హు! అతావు గాకుండా పొయ్యుంటేనా?..."

ఆ మాట వినేకుందికి నా నోట్లో మాట నా నోట్లోనే ఉండిపాయ. ఒళ్ళట్నే ఉడికిపాయ. అది ఎమ్మెల్లే మేనల్లుడి కుక్క గాకుండా పొయ్యుంటే... ఈళ్ళ ప్రెతాపం పెనుంవూరు పేట దాటిపొయ్యుండు. లేకుండానే పాపం! వర్సపెట్టి కరిపించుకుంటా ఉండారు. ఈళ్లకెట్టా చెప్పాల్నో తోసక రొంచేపు ఆలోసిస్తి! ఆమిందట–

"నిఁజివే! నిఁజివేరా ఎంగట్రెడ్డీ! అది ఎమ్మెల్లే మేనల్లుడి దాపులో కుక్క గాకుండా ఇంకెవురి కుక్కయినా అయ్యుంటే దానిగెతి కుక్కలగెతి అయ్యుండు. ఆడిదాకా బాగానే ఉండాది. అయితే ఇప్పుడొక సిన్న లిటిగేసనొచ్చి పడెగదరా!"

"లిటిగేసనా? ఇప్పుడు మనఁవేఁవన్నా బూవులు బావులు కొంటా ఉండావా? పోనీ! అమ్మతా ఉండావా? పిచ్చికుక్కగరిస్తే సూదిమొందు కేందన్నా లిటిగేసన్!"

"ఒరే అబ్బోడా! పిచ్చి కుక్క కరిస్తే సూది మొందులుండాయ్. ఇది సాదారణఁవయిన పిచ్చి కుక్క కాదుగదరా? దీనికి రాజకీయం గాలి తగిలిందే!

ఈ గాలితగిల్నె పిచ్చికుక్కలకు సాదారణ పిచ్చికుక్కల మందు పన్జెయ్యదు గదరా? ఆ మొందు కనిపెట్టే దానికి శానామంది శతపోర్తా ఉండారు. ఆయరవదాకా ఉండాలంటే అబ్బోడిగెతి ఏఁవయితిందో! ఏఁవో గదరా?" అంటి.

ఎంగట్రెడ్డి మొకాన కత్తేటుకు నెత్తురు సుక్క లేదు.

నేను మాత్రం కలిగినోడి కుక్క జోలిగ్గూడా పోలేని మా ఊరితత్త్వానికి రొండు సేతులెత్తి దణ్ణం పెడ్తి!. ●

కథా నిలయం
శ్రీకాకుళం

ఆంధ్రజ్యోతి
(17, ఫిబ్రవరి 1989)